సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 12 । జూలై । 2024



ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందాలి

జిల్లాలో వెనుకబడిన తరగతుల ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. - 8లో..



రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

సినీ హీరో బూచేపల్లి కమలాకరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఈ నెల 13వ తేదీ చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
35/26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

కేజీ పొగాకు గరిష్ట ధర రూ.366

● రెండు వేలం కేంద్రాల్లోనే కొనసాగుతున్న పొగాకు కొనుగోళ్లు



పొదిలి కేంద్రంలో వేలానికి సిద్ధంగా ఉన్న పొగాకు బేళ్లు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో కేజీ పొగాకు గరిష్ట ధర గురువారం రూ.366 పలికినట్లు ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. టంగుటూరు, పొదిలి రెండు కేంద్రాల్లో మాత్రమే గురువారం పొగాకు వేలం జరిగినట్లు చెప్పారు. మిగిలిన కేంద్రాల్లో రైతులు పండించిన అధిక పంటకు బోర్డు నుంచి అనుమతి వస్తే మాత్రమే వేలం జరుగుతుందని ఆర్ఎం తెలిపారు. టంగుటూరు, పొదిలి రెండు కేంద్రాల్లో గురువారం వేలానికి 1,889 బేళ్లు రాగా, 1,555 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 334 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. టంగుటూరు కేంద్రంలో 103వ రోజు వేలం పాటకు 1,457 బేళ్లు రాగా, 1,200 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 257 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.366, కనిష్ట ధర రూ.205, సరాసరి రూ.305.91 పలికింది. పొదిలి కేంద్రంలో 98వ రోజు వేలం పాటకు 432 బేళ్లు రాగా, 355 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 77 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.359, కనిష్ట ధర రూ.204, సరాసరి రూ.306.56 పలికింది. ఈ రెండు కేంద్రాల్లో కూడా శనివారం వరకు మాత్రమే పొగాకు కొనుగోళ్లు జరిగే అవకాశం ఉందని, ఆ తర్వాత సూర కొనుగోలు చేస్తామని ఆర్ఎం వివరించారు.

జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇప్పించాలి

ఒంగోలు అర్బన్: జిల్లాలో అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు విద్యాహక్కు చట్టం మేరకు స్కూలు ఫీజుల్లో 50 శాతం రాయితీ ఇప్పించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) నాయకులు కోరారు. గురువారం ప్రకాశం భవనంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. ఫీజు రాయితీపై విద్యా శాఖ నుంచి ఉత్తర్వులు ఇప్పించాలని కోరారు. ఆ ఉత్తర్వులు అమలు చేసేలా విద్యాశాఖ అధికారులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సంయుక్త సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు గొట్టిపాటి నాగేశ్వరరావు, ఎస్వీ బ్రహ్మం, భక్తవత్సలం, అశోక్ బాబు, ఎల్.రాజు, కిరణ్, ఫైరోజ్‌బేగ్, జనార్దన్, రాజశేఖర్, భాస్కర్‌రెడ్డి, పలువురు జర్నలిస్టులు ఉన్నారు.

వందనం..దగా

నాడు అందరికీ అంటూ హామీ.. నేడు ఇంటికి ఒక్కరికే లబ్ధి



కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన తల్లికి వందనం హామీ

అమ్మ ఒడి పథకాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటికి ఒక్కరికే ఇస్తున్నారని, తాము అధికారంలోకి వస్తే ఇంట్లో చదువుతున్న పిల్లలందరికీ తల్లికి వందనం పేరుతో రూ.15 వేల చొప్పున ఇస్తామని చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్‌తో పాటు కూటమి నేతలంతా హామీల వర్షం కురిపించారు. ఇదే విషయాన్ని చంద్రబాబు ప్రతి ఎన్నికల సభలోనూ బలంగా చెప్పారు. అయితే, అధికారంలోకి వచ్చాక ఎప్పటిలాగే వెన్నుపోటుపొడిచాడు. బుధవారం రాత్రి జీఓ నంబర్ 29ని విడుదల చేసి తల్లిదండ్రుల ఆశలపై ప్రభుత్వం నీళ్లుచల్లింది. ఆధార్ తప్పనిసరని, దారిద్ర్యరేఖ దిగువన ఉండి 75 శాతం హాజరు ఉండాలంటూ నిబంధనలు పెట్టింది. ఇంట్లో ఎంతమంది చదువుతున్నా తల్లికి మాత్రమే రూ.15 వేలు ఇస్తామంటూ ప్రకటించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, గత నాలుగేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం క్రమం తప్పకుండా జిల్లాలోని తల్లుల ఖాతాలో రూ.1330.31 కోట్లు జమచేసింది.

ఎంతమంది పిల్లలుంటే.. అంతమందికి ఇవ్వాలి



మార్కాపురం పూలసుబ్బయ్య కాలనీలో నివాసం ఉంటున్న మా కుటుంబంలో మా మనవళ్లకు గత ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం అందింది. మార్కాపురం పట్టణంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో ఒకరు 3వ తరగతి, మరొకరు 5వ తరగతి చదువుతున్నారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం నగదు అందిస్తానన్నారు. ఇప్పుడేమో ఒక్కరికే అన్నట్లుగా చెబుతున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఒక ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికీ తల్లికి వందనం పథకం నగదు ఇవ్వాలి.

– జి.అంకమ్మ, పీఎస్ కాలనీ, మార్కాపురం

నా ఇద్దరి పిల్లలకు కలిపి రూ.30 వేలు వెంటనే ఇవ్వాలి



మాది చాలా పేద కుటుంబం. మాకు ఇద్దరు కుమారులున్నారు. వారు ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. ఒకరు పదో తరగతి, మరొకరు ఎనిమిదో తరగతి చదువుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలప్పుడు చదువుకునే ప్రతి విద్యార్థికి రూ.15 వేలను తల్లికి వందనం పథకం ద్వారా ఇస్తామని హామీ ఇచ్చింది. దాని ప్రకారం నా ఇద్దరు పిల్లలకు రూ.30 వేలు వెంటనే ఇవ్వాలి. తద్వారా నా పిల్లల చదువుకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలి.

– కళ్లగుంట విజయ, కొండపి

- తల్లికి వందనంపై మాటమార్చిన ప్రభుత్వం
- ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు ఇస్తామని హామీ
- అధికారంలోకి వచ్చాక మాటతప్పిన చంద్రబాబు
- జీవో జారీతో వ్యక్తమవుతున్న అనుమానాలు
- జిల్లాలో 1 నుంచి ఇంటర్ వరకూ 3.5 లక్షల మంది విద్యార్థులు
- అందరికీ ఇవ్వాలంటే రూ.525 కోట్లు అవసరం
- తల్లిదండ్రుల్లో పెరుగుతున్న ఆందోళన
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా అమ్మ ఒడి నిధులు విడుదల
- నాలుగేళ్లుగా రూ.1330.31 కోట్లు జమ

Scheme	Description
TALLIKI VANDANAM	As a part of Government Assured Flagship Programs, the Government under "TALLIKI VANDANAM" scheme is providing financial assistance of Rs.15,000/- per annum to each mother or recognized guardian who is below poverty line household and sending their children to schools/colleges i.e., from Classes I to XII.
STUDENT KITS	Under Vidya Kanuka, the Government school students of Classes I to XII are provided with the following benefits: (i) Bilingual Textbooks (English content on one page and Telugu version on the opposite page) (ii) Notebooks and Workbooks (iii) Three pairs of Uniforms with stitching charges (iv) A pair of Shoes and two pairs of Socks (v) A Belt and a School Bag (vi) Pictorial dictionary, Oxford dictionary

బుధవారం విడుదల చేసిన తల్లికి వందనం జీవో

ఒంగోలు: జిల్లా వ్యాప్తంగా మూడు లక్షల మంది విద్యార్థులు పాఠశాల విద్యాశాఖ పరిధిలో విద్యనభ్యసిస్తున్నారు. జిల్లాలో 2,930 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. అందులో ప్రభుత్వానికి సంబంధించి 2,128 ప్రాథమిక, ప్రాథమికోన్నత, 302 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అలాగే 550 ప్రైవేటు విద్యా సంస్థలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 1.96 వేల మంది విద్యార్థులున్నారు. మరో 94 వేల మంది ప్రైవేటు విద్యా సంస్థల్లో చదువుతున్నారు. మరో 50 వేల మంది ఇంటర్ చదువుతున్నారు. మొత్తంగా 3.50 లక్షల మంది విద్యార్థుల్లో 75 శాతం మంది బీపీఎల్ కోటా కింద ఉండే అవకాశం ఉంది. అంటే సుమారు 2,62,500 మంది విద్యార్థులకు మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఒక్కో విద్యార్థికి రూ.15 వేల చొప్పున అందించాలి. దీని ప్రకారం రూ.393.75 కోట్లు అవసరం అవుతుంది.

జిల్లాకు రూ.525 కోట్లు అవసరం...

జిల్లా వ్యాప్తంగా ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకూ 3.5 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు జమ చేయాలంటే అందుకు రూ.525 కోట్లు అవసరం అవుతాయి. అలాకాకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2.62 లక్షల మందికి రూ.393.75 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. తాజా నిబంధనల ప్రకారం తల్లికి రూ.15 వేలు మాత్రమే అంటే ఆ సంఖ్య భారీగా తగ్గిపోతుంది. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది.

గత ప్రభుత్వంలో...

గత ప్రభుత్వంలో జగనన్న అమ్మ ఒడి పేరుతో 1 నుంచి 12 తరగతుల వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను చదివించుకునే తల్లులకు ఉపశమనంగా ప్రభుత్వం రూ.15 వేలు ఆర్థిక సాయం అందించింది. ఒక తల్లికి ఇద్దరు పిల్లలు లేదా ముగ్గురు పిల్లలున్నా.. వారంతా 12వ తరగతిలోపు పాఠశాలల్లో విద్యనభ్యసిస్తుంటే వారి తల్లికి రూ.15 వేలు ఆర్థికసాయం అందేది. అందులో రెండు వేల రూపాయలను కట్ చేసి ప్రభుత్వ పాఠశాలల రక్షణకు నియమించిన వాచ్‌మెన్‌లకు జీతాలుగా, పాఠశాలల్లో పారిశుధ్యం సక్రమంగా అమలుచేసేందుకు ఏర్పాటు చేసిన ఆయాలకు నెలకు రూ.6 వేల చొప్పున జీతాలుగా ఇచ్చేవారు. 75 శాతం హాజరు ప్రామాణికంగా తీసుకోవడంతో విద్యా సంవత్సరం ముగిసేనాటికి హాజరును పరిశీలించి పాఠశాలలు పునఃప్రారంభం అవగానే అమ్మ ఒడి నిధులు తల్లుల ఖాతాలో జమయ్యేవి. దాంతోపాటు వాచ్‌మన్, ఆయాల జీతాలకు నిధులు జమయ్యేవి. కానీ, ఈ ఏడాది జూన్‌లో అమ్మ ఒడి నిధులకు ప్రస్తుతం బ్రేక్ పడింది. జగనన్న అమ్మ ఒడి పథకం 2019–20లో ప్రారంభమైంది. నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా రూ.1,330.31 కోట్లను తల్లుల ఖాతాలో జమచేశారు. 2023–24కి సంబంధించిన అమ్మ ఒడి నిధులు ఈ ఏడాది జూన్‌లో విడుదల కావాల్సి ఉంది.

సంవత్సరం	తల్లుల సంఖ్య	జమయిన మొత్తం (రూ.కోట్లలో)
2019–20	276115	414.20
2020–21	197329	295.99
2021–22	209776	314.66
2022–23	203663	305.46
2023–24	2024 జూన్‌లో విడుదల కావాలి	

నాకు ముగ్గురు పిల్లలు.. అందరికీ తల్లికి వందనం ఇవ్వాలి



నా ముగ్గురు పిల్లలు కొమరోలులోని ఒక ప్రైవేటు పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. గత సంవత్సరం వరకు జగనన్న అందించిన అమ్మ ఒడి పథకం ద్వారా మేము లబ్ధి పొందాం. ఈ ఏడాది కొత్త ప్రభుత్వం ఇస్తామన్న తల్లికి వందనం పథకం కోసం ఎదురుచూస్తున్నాం. ఇప్పటికే మా పిల్లలను స్కూల్లో చేర్పించాం. బుక్స్, ఫీజులకు వేల రూపాయలు ఖర్చవుతోంది. ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమంది పిల్లలకూ రూ.15 వేల చొప్పున తల్లి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. కానీ, ఇప్పటివరకు ఆ నగదు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తల్లికి వందనం పథకం అమలు చేయాలి.

– బి.వసంత, పాముూరుపల్లె, కొమరోలు మండలం

స్కూల్లో చేరేటప్పుడు ఇస్తేనే ఉపయోగం



పాఠశాలలు తెరిచి పిల్లలను చేర్పించే సమయంలోనే తల్లికి వందనం పథకం నగదు అందిస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుంది. లేకుంటే అప్పులు చేయాల్సి వస్తోంది. నా ఒక్కగానొక్క కుమార్తె మండల పరిషత్ పాఠశాలలో చదువుతోంది. స్కూల్లో చేర్చే సమయంలో అనేక రకాల ఖర్చులుంటాయి. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన సమయానికి తల్లి బ్యాంక్ ఖాతాలో నగదు జమ చేశారు. చాలా బాగా ఉపయోగించుకున్నాం. ప్రస్తుత ప్రభుత్వం ఎప్పుడు ఇస్తారో.. ఎంత మందికి ఇస్తారో కూడా చెప్పడం లేదు.

– నాటారు సుబ్బరత్నమ్మ, మోటుమాల, కొత్తపట్నం మండలం

తల్లికి వందనం నగదు త్వరగా ఇవ్వాలి



నాకు ఇద్దరు పిల్లలు. పాముూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఒకరు 7వ తరగతి, మరొకరు 4వ తరగతి చదువుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ఏటా తల్లుల ఖాతాల్లో జమచేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం పాఠశాలలు తెరిచి నెలరోజులైంది. కొంత ఫీజులు చెల్లించాలని అడుగుతున్నారు. బుక్స్, ఇతర సామగ్రికి ఇప్పటికే కొంత చెల్లించాం. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు మాకు రూ.30 వేలు వస్తాయని, ఫీజులు చెల్లించాలని ఎదురుచూస్తున్నాం. వెంటనే తల్లికి వందనం నగదు అందించాలి.

– అనూష, పాముూరు

ఆశగా ఎదురుచూస్తున్నాం..



స్కూళ్లు తెరిచి నెలరోజులైంది. తల్లికి వందనం పథకం నగదు కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాం. నా ఇద్దరు పిల్లల్లో ఒక బాబు ఒంగోల్లో ఇంటర్ చదువుతున్నాడు. కుమార్తె ఎయిడెడ్ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. గత ప్రభుత్వం పాఠశాలలు ప్రారంభమైన వెంటనే అమ్మ ఒడి పథకం నగదు అందించింది. దాంతో పిల్లలకు ఫీజులు కట్టాం. ప్రస్తుత ప్రభుత్వం ఇంకా ఏ విషయం స్పష్టంగా చెప్పడం లేదు. ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటుంటే అంతమందికీ తల్లికి వందనం ఇస్తామన్నారు. ఇప్పుడు ఆ విషయంగానీ, ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కడ చదువుతున్నా ఇస్తారా..? అనే విషయంగానీ స్పష్టంగా చెప్పకపోవడం గందరగోళానికి తావిస్తోంది. వెంటనే స్పష్టత ఇవ్వాలి.

– గోనా మరియమ్మ, వీరాపురం ఎస్సీకాలనీ, హనుమంతునిపాడు మండలం

ఇద్దరు పిల్లలకూ ఇస్తే బాగుంటుంది



నేను మార్కాపురం పట్టణంలోని ఓ సూపర్ మార్కెట్లో గుమస్తాగా పని చేస్తున్నాను. నా భర్త కూలి పనికి వెళ్తాడు. నాకు ఇద్దరు కూతుర్లు. స్థానిక మున్సిపల్ పాఠశాలలో ఒకరు 5వ తరగతి, మరొకరు 2వ తరగతి చదువుతున్నారు. నా ఇద్దరు పిల్లలకూ తల్లికి వందనం పథకం నగదు అందిస్తే మాకు ఎంతో మేలు జరుగుతుంది. ఎంత మంది పిల్లలున్నా తల్లికి వందనం నగదు ఇస్తామని ఎన్నికల హామీల్లో చెప్పారు. అదే విధంగా ఇవ్వాలని మేము భావిస్తున్నాం.

– జి.సౌజన్య, 10వ వార్డు, మార్కాపురం

మా పిల్లలిద్దరికీ తల్లికి వందనం ఇవ్వాలి



మార్కాపురం పట్టణంలోని ఏబీయం కాంపౌండ్‌లో మేము నివాసం ఉంటున్నాం. నాకు ఇద్దరు పిల్లలు. ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఒక ఇంట్లో ఎంత మంది చదువుకునే పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం కింద ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. మా ఇంట్లో చదువుకుంటున్న మా పిల్లలిద్దరికీ తల్లికి వందనం కింద డబ్బులివ్వాలి.

– డి.సౌమ్య, మార్కాపురం

ఎప్పుడిస్తారో స్పష్టంగా చెప్పాలి



పాఠశాలలు తీసి నెల రోజులైంది. ఇంత వరకు తల్లికి వందనం పథకం అమలు చేయలేదు. మా ఇద్దరు పిల్లలు మండల పరిషత్ స్కూల్లో చదువుకుంటున్నారు. వారికి కావాల్సినవి కొనడానికి డబ్బుల కోసం అవస్థలు పడుతున్నాం. స్కూళ్లు తెరిచే సమయంలోనే తల్లికి వందనం పథకం నగదు అందిస్తే ఎంతో ఉపయోగపడుతుంది. పిల్లలకు కావాల్సినవన్నీ కొనివ్వొచ్చు. ఇంట్లో ఎంత మంది చదువుకుంటుంటే అంతమందికీ ఇస్తామన్నారు. ఇప్పుడు ఆ విషయం స్పష్టంగా చెప్పడం లేదు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అమ్మ ఒడి పథకాన్ని ఎంతో కచ్చితంగా అమలు చేశారు. సీఎం చంద్రబాబు కూడా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

– పురిణి వెంకటేశ్వరమ్మ, మోటుమాల, కొత్తపట్నం మండలం

ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● పనులను పరిశీలించిన ఉక్కు మంత్రిత్వశాఖ డైరెక్టర్, జలశక్తి అభియాన్ నోడల్ ఆఫీసర్ దేవీ దత్త సతపతి



వెల్లంపల్లిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న నోడల్ ఆఫీసర్ దేవీ దత్త సతపతి, సైంటిస్ట్ సంతోష్ గౌతమ్, పీడీ అర్జునరావు, తదితరులు

మద్దిపాడు: ఉపాధి హామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకుని పని కోసం వలసలు వెళ్లకుండా స్వగ్రామాల్లోనే నివాసం ఉండవచ్చని ఉక్కు మంత్రిత్వశాఖ డైరెక్టర్, జలశక్తి అభియాన్ నోడల్ ఆఫీసర్ దేవీ దత్త సతపతి అన్నారు. మద్దిపాడు మండలంలోని వెల్లంపల్లి, అన్నంగి గ్రామాల్లో ఉద్యానవన పంటలు సాగుచేస్తున్న రైతుల పొలాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలు చేసిన పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో చేస్తున్న పనులు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు సాగుచేసిన ఉద్యానవన పంటల్లో మొక్కల చుట్టూ రింగ్ ట్రెంచ్‌లు వేయడం, అన్ని మొక్కలకు నీరందే విధంగా ఏర్పాటు చేయడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఉద్యానవన పంటలు వేసిన రైతులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ అందరికీ ఉపాధి అందుతుందా అని తెలుసుకున్నారు. ప్రజలు వలసలు పోకుండా ఉండటానికే కేంద్ర ప్రభుత్వం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ప్రవేశపెట్టిందని, కూలీలందరికీ ఉపాధి కల్పించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. అనంతరం ఉపాధి కూలీలతో ఆయన ఫొటోలు దిగారు. కార్యక్రమంలో సైంటిస్ట్ సంతోష్ గౌతమ్, పీడీ బి.అర్జునరావు, ఏపీఓ ఎండీ మధుసూదన్, ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీఓ శ్రీహరి, ఏపీఓ ధనంజయవర్మ, గ్రామ సర్పంచ్‌లు లోకేశ్వరి, అనిల్, సెక్రటరీలు మాధవి, అనూష, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

చిన్న కుటుంబంతో చింతలుండవు

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు, సిబ్బంది

ఒంగోలు టౌన్: ప్రణాళికాబద్ధమైన చిన్న కుటుంబంతోనే చింతలు తీరతాయని, కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఏర్పాటు చేసిన ర్యాలీని జెండా ఊపి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి చెందిన భారత దేశానికి కొత్త గుర్తింపు కుటుంబ ప్రణాళిక అనే నినాదాన్ని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. తల్లీబిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డకు బిడ్డకు మధ్య అంతరం కలిగి ఉండాలని ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ ర్యాలీని నిర్వహించడం జరుగుతోందన్నారు. మొదటి బిడ్డ బడికి, రెండో బిడ్డ ఒడికి అనే నినాదంతో కుటుంబ నియంత్రణ పద్ధతి పాటించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు సరైన కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించాలని వైద్యారోగ్య సిబ్బందికి సూచించారు. అధిక జనాభా వలన కలిగే కష్టనష్టాలను తెలుసుకోవాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఆర్థికంగా, సామాజికంగా వెనకబడటం, నిరుద్యోగం పెరగడం, జనాభాకు సరిపడా ఆహారం ఉత్పత్తి చేయలేకపోవడం మొదలైన సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. లేత వయసులో వివాహం చేయడం వలన కాన్పు కష్టమై మాతృ మరణాలు సంభవిస్తున్నాయన్నారు. వీటన్నింటిపై అవగాహన అవసరమని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ సురేష్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పంటల సాగుకు సిద్ధం కావాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో పంటల సాగుకు అవసరమైన ఇన్‌పుట్స్ అన్నింటినీ ముందుగానే పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో గురువారం స్థానిక ప్రకాశం భవనంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో సాగు వివరాలు, అందుబాటులో ఉన్న నీటి వనరులు, సాగు పద్ధతులు, ప్రభుత్వం నుంచి అందిస్తున్న ఇన్‌పుట్స్, దిగుబడి లక్ష్యాలు, ప్రభుత్వం నుంచి రైతులకు అందుతున్న పథకాలు, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న దృష్ట్యా రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సిద్ధంగా ఉంచాలన్నారు. అర్హులకు సీసీఆర్సీ కార్డులను త్వరగా మంజూరు చేయాలన్నారు. వ్యవసాయంలో ఖర్చు తగ్గించేందుకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకునేలా రైతులకు అవగాహన కల్పించి ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. ప్రకృతి సేద్యం వైపుగా మరింత మంది రైతులను ప్రోత్సహించాలన్నారు. ఉత్పత్తులకు తగిన మార్కెటింగ్ అవకాశాలను మెరుగుపరచడంపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించిన వివరాలను అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి, ఏపీఎంఐపీ పీడీ రమణ, ఉద్యానవన శాఖాధికారి గోపీచంద్, ఆత్మ పీడీ అన్నపూర్ణ, మార్కెటింగ్ ఏడీ ఉపేంద్ర, మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్‌రెడ్డి, కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ డీపీఎం సుభాషిణి, సెరీకల్చర్ అధికారి సుజయ్‌కుమార్, ఏపీ మార్క్‌ఫెడ్, విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు పాల్గొన్నారు.



వ్యవసాయ శాఖాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రత్యేక విక్రయ కేంద్రాలు ప్రారంభం

ఒంగోలు అర్బన్: మార్కెట్ ధరల కంటే తక్కువ ధరలకు ప్రజలకు సరుకులు విక్రయించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక విక్రయ కేంద్రాలను స్థానిక ఎమ్మెల్యే జనార్దన్, జేసీ గోపాలకృష్ణ గురువారం ప్రారంభించారు. ఒంగోలు లాయర్‌పేటలోని రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన ప్రధాన కేంద్రాన్ని ప్రారంభించి సరుకులు పంపిణీ చేశారు. కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లోని రైతుబజార్, డీమార్ట్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాలను కూడా ప్రారంభించారు. కేజీ రూ.49కి స్టీమ్ బియ్యం, రూ.48కి బీపీటీ పచ్చిబియ్యం, రూ.160కి కందిపప్పు అందజేయనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

అపార్ట్‌మెంట్ నుంచి జారిపడి మహిళ మృతి

ఒంగోలు టౌన్: భవన నిర్మాణ పనులకు వెళ్లిన ఒక మహిళ పొరపాటున జారిపడి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని మారుతీనగర్‌లో నివసించే అల్లూరమ్మ (33) భవన నిర్మాణ కార్మికురాలిగా పని చేస్తుంది. గురువారం రాజీవ్‌నగర్‌లోని ఒక అపార్ట్‌మెంటులో జరుగుతున్న పనులకు వెళ్లారు. మూడో అంతస్తుపై వేసిన పిల్లర్లకు బిగించిన ఇనుప బాక్సులను తొలగించే క్రమంలో ఆమె పొరపాటున జారిపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఆమెను వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

16న రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు

తర్లుపాడు: మొహర్రం పండుగ సందర్భంగా మండలంలోని తుమ్మలచెరువులో ఈ నెల 16న రాష్ట్రస్థాయి రెండు పండ్ల విభాగంలో బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. ఆరుగురు విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి బహుమతిగా రూ.25 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతిగా రూ.15 వేలు, నాల్గవ బహుమతి రూ.10 వేలు, 5వ బహుమతి రూ.5 వేలు, ఆరవ బహుమతి రూ.3 వేలు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 94407 91698, 99122 61298 నంబర్లను సంప్రదించాలని కోరారు. తుది నిర్ణయం కమిటీ సభ్యులదే అని వారు తెలిపారు.

ఆర్‌ఎంపీ ఇంట్లో చోరీ


బీరువా తలుపులు తెరిచి ఉన్న దృశ్యం

సింగరాయకొండ: ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఆర్‌ఎంపీ దాసరి కోటేశ్వరరావు ఇంట్లో చోరీ జరిగింది. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ వెంకటేశ్వర కాలనీలో జరిగింది. బాధితుల కథనం ప్రకారం కోటేశ్వరరావు, అతని భార్య ఉష బుధవారం రాత్రి శానంపూడి గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి గురువారం ఉదయం సుమారు 6.30 గంటల సమయంలో వచ్చారు. ఆ సమయంలో ఇంటి తలుపు తెరిచి ఉండటాన్ని గమనించి లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులో 5 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.6 వేల నగదు, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఉష ఒంగోలులో నర్స్‌గా పనిచేస్తోంది. అయితే కోటేశ్వరరావు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లేటప్పుడు వరండాలో భద్రపరచి పోయేవారని, ఈ విషయం కాలనీ వాసులందరికీ తెలసని, ఎవరో తెలిసిన వ్యక్తులే చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. క్లూస్ టీం వచ్చి వేలు ముద్రలు సేకరించిందని, త్వరలో దొంగలు దొరుకుతారని పోలీసులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనధికార బ్యారన్ల నిర్మాణం చట్ట విరుద్ధం

కొండెపి(సింగరాయకొండ): అనధికార బ్యారన్ల నిర్మాణం చట్ట విరుద్ధమని రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు అన్నారు. కొండెపిలో గురువారం వేలం జరుగుతున్న తీరును ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు మార్కెట్ ఈ ఏడాది లాగా వచ్చే సంవత్సరం కూడా ఉంటుందని చెప్పలేమని, రైతులు తొందరపడి అధిక ధరకు పొలం కౌలుకు తీసుకొని పొగాకు సాగు చేయవద్దన్నారు. పొగాకును ఎక్కువ పండించి అనధికార బ్యారన్లను నిర్మించి నష్టపోవద్దని రైతులకు సూచించారు. అనంతరం కట్టావారిపాలెం, నేతివారిపాలెంలోని బ్యారన్లను పరిశీలించారు. కార్యక్రమంలో వేలం నిర్వాహాధికారి జి.సునీల్‌కుమార్, తులసీ, అధికారులు పాల్గొన్నారు.

లాడ్జిలో యువకుడి ఆత్మహత్య

ఒంగోలు టౌన్: నగరంలోని ఒక లాడ్జిలో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. లాడ్జి యజమాని రవిబాబు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... జరుగుమల్లి మండలం వద్దినేనివారిపాలెం గ్రామానికి చెందిన మూలె రవీంద్రారెడ్డి (27) ఈ నెల 10వ తేది మధ్యాహ్నం ఒంగోలులోని ఒక లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నాడు. రాత్రి 9.30 గంటలకు బయటకు వెళ్లిన అతడు కాసేపటి తరువాత రూంకు వచ్చేశాడు. లోపల గడియ పెట్టుకొని నిద్రపోయాడు. మరుసటి సాయంత్రం 6.30 గంటల వరకు బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి రూం బాయ్‌తో కలిసి తలుపు పగులగొట్టి చూడగా అతడు మంచంపై అపస్మారక స్థితిలో పడిపోయి ఉన్నాడు. నోటి నుంచి నురగలు వస్తూ పురుగుమందుల వాసన వేసింది. అప్పటికే అతడు మరణించి ఉన్నాడు. దాంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మద్యంలో పురుగుల మందు కలుపుకొని సేవించి మరణించినట్లు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందాలి


సంక్షేమ శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్:

జిల్లాలో బలహీన, వెనుకబడిన తరగతుల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందేలా ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. వివిధ సంక్షేమ శాఖల అధికారులతో గురువారం ప్రకాశంభవనంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల ద్వారా జరుగుతున్న కార్యాక్రమాలపై ఆరా తీశారు. జిల్లాలో ఈ వర్గాల ప్రజలు ఎక్కువగా ఉన్నందున అధికారులు మరింత దృష్టి సారించాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో వసతులు మెరుగుపరిచి నాణ్యమైన ఆహారం, విద్య అందేలా చూడాలన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో పనిచేస్తున్న సంక్షేమ హాస్టళ్ల వివరాలను, ఆయా భవనాల స్థితిగతులను, వాటిలో విద్యార్థులకు అందుతున్న స్కాలర్‌షిప్‌ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, బిసి సంక్షేమ శాఖ అధికారి అంజల, దివ్యాంగుల సంక్షేమ అధికారి అర్చన, మైనార్టీల సంక్షేమ అధికారి నారాయణ, ఎస్‌సి కార్పొరేషన్ ఈడి అర్జున్ నాయక్, మైనార్టీ కార్పొరేషన్ ఈడి ధనలక్ష్మి, స్టెప్ సిఈఓ లోకేవ్వరరావు, మేనేజర్ శ్రీమన్నారాయణ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎప్పటి పని అప్పుడే పూర్తి చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- ఆర్డీఓ కార్యాలయం ఆకస్మిక తనిఖీ


ఆర్డీఓ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ఎప్పటి పని అప్పుడే పూర్తి చేయాలని, ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యం ఉండకూడదని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఒంగోలు ఆర్‌డీఓ కార్యాలయాన్ని గురువారం అకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో ఎంతమంది పనిచేస్తున్నారు, ఎవరు ఏ అంశాన్ని చూస్తున్నారు అంటూ ఆరా తీసింది. ర్యాండమ్‌గా ఫైళ్లను పరిశీలించి పలు సూచనలు చేసారు. ఆమోదం కోసం తహశీల్దార్ల కార్యాలయాల నుంచి వచ్చిన ఫైళ్లపై ప్రశ్నించారు. ఏ ఉద్యోగి ఏ అంశంపై పనిచేస్తారో తెలిసేలా సంబంధిత ఉద్యోగి సీటు వద్ద డిస్‌ప్లే ఉంచాలన్నారు. అనంతరం కార్యాలయంలోని గదులను క్షుణ్ణంగా పరిశీలించారు.

కౌలు రైతులకు కార్డులు మంజూరు చేయండి


మాట్లాడుతున్న, సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

మార్కాపురంరూరల్: వ్యవసాయ, రెవెన్యూ అధికారులు గ్రామాల్లో సమావేశాల్లో ఏర్పాటు చేసి కౌలురైతులను గుర్తించి వారి ద్వారా దరఖాస్తులు స్వీకరించాలని సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న అర్జీలను పరిశీలించి మూడు రోజుల్లో మంజూరు చేయాలన్నారు. ఏడీఏ బాలాజీనాయక్ మాట్లాడుతూ పంట రుణాలు, ఈ పంట నమోదు, అన్నదాత సుఖీభవ, పంట నష్టపరిహారం, పంటల బీమా, పంట కొనుగోలు, సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను కౌలురైతులకు సైతం అందిస్తామన్నారు. సమావేశంలో ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, వీఆర్‌ఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

భార్య గొంతు కోసిన భర్త


జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న నాగలక్ష్మి

ఒంగోలు టౌన్: చెడు వ్యసనాల బారిన పడి ఒక వ్యక్తి క్షణికావేశంలో కత్తితో భార్య గొంతు కోసి పరారయ్యాడు. ఈ సంఘటన ప్రకాశం జిల్లా ఒంగోలు నగర శివారులోని త్రోవగుంటలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కూచిపూడి నాగలక్ష్మి, గోపికృష్ణ దంపతులు నగర శివారులోని త్రోవగుంటలో నివసిస్తుంటారు. చెడు వ్యసనాలకు అలవాటు పడిన గోపికృష్ణ ప్రతిరోజు మద్యం సేవించి వచ్చి భార్యతో గొడవపడి కొట్టి శారీరకంగా హింసించేవాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున ఇంటికి వచ్చిన గోపికృష్ణ భార్యతో ఘర్షణకు దిగాడు. ఇష్టమొచ్చినట్లు కొట్టాడు. అంతటితో ఆగకుండా కత్తి తీసుకొని చేతులు, ముఖంపై గాయం చేశాడు. కత్తితో గొంతు కోశాడు. ప్రాణభయంతో నాగలక్ష్మి కేకలు వేయడంతో గోపి పారిపోయాడు. అపస్మారకస్థితిలో ఉన్న నాగలక్ష్మిని కుటుంబ సభ్యులు వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం బాధితురాలు ఆరోగ్యంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. విచక్షణారహితంగా కొట్టడమే కాకుండా తమ కూతురిని హతమార్చేందుకు ప్రయత్నించిన గోపికృష్ణను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని నాగలక్ష్మి తల్లిదండ్రులు కోరుతున్నారు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు


తీవ్రగాయాలైన సుబ్రహ్మణ్యాచారి


గాయాలైన గంగాదేవి


గాయాలైన బ్రహ్మచారి

పెద్దారవీడు: ఆటో, ద్విచక్రవాహనం ఢీకొట్టంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలో తోకపల్లి గ్రామ సమీపంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...యర్రగొండపాలెం మండలం అమనిగుడిపాడు గ్రామానికి చెందిన చేవూరి సుబ్రమణ్యాచారి, బ్రహ్మచారి, గంగాదేవిలు కలిసి ఆటో మాట్లాడుకొని వ్యక్తిగత పనులపై మార్కాపురం పట్టణానికి బయలుదేరారు. యర్రగొండపాలెం మండలం గంగుపల్లి గ్రామానికి చెందిన దేశావత్ రామాంజినాయక్ ద్విచక్రవాహనంపై మార్కాపురం నుంచి సొంత గ్రామానికి వెళ్తున్నారు. జాతీయ రహదారి తోకపల్లి గ్రామ సమీపంలోకి రాగానే రెండు వాహనాలు ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న చేవూరి సుబ్రహ్మణ్యాచారి, బ్రహ్మచారి, గంగాదేవి, ద్విచక్ర వాహనంపై వెళ్తున్న రామాంజినాయక్‌లకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గాయాలైన నలుగురిని మార్కాపురం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. డాక్టర్ల సలహా మేరకు తీవ్రగాయాలైన బ్రహ్మచారిని మేరుగైన వైద్యం అందించేందుకు గూంటూరు తరలించారు.

విద్యుత్ శాఖాధికారుల దాడులు

- 125 కేసులు నమోదు
- 3.47 లక్షలు జరిమానా


మాట్లాడుతున్న ఈఈ నాగేశ్వరరావు

మార్కాపురం: మార్కాపురం డివిజన్‌లో గురువారం విద్యుత్ విజిలెన్స్ ఈఈ కట్టా వెంకటేశ్వర్లు, ఆపరేషన్ సీఈ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 39 విద్యుత్ బృందాలు దాడులు నిర్వహించి విద్యుత్ చౌర్యం చేస్తున్న 125 మందిపై కేసులు నమోదు చేసినట్లు డీఈ సీయ్యానాయక్ గురువారం తెలిపారు. విద్యుత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ విజిలెన్స్ సీఐ టీటీ నాయక్‌తో పాటు గిద్దలూరు డీఈ శేషగిరిరావు, విద్యుత్ విజిలెన్స్ డీఈ శ్రీనివాసరావులు, ఏఈలు బృందాలుగా ఏర్పడి డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 1638 సర్వీసులను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో అధిక లోడ్ వాడటంతో పాటు మాల్ ప్రాక్టీస్ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు 125 గుర్తించి వారికి మొత్తం రూ.3.47 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈఈ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం కరెంటు బిల్లులను ఫోన్‌పే, పేటీఎం, గూగల్‌పే ఇతర యూపీఐ యాప్స్ ద్వారా డైరెక్టుగా చెల్లించడం కుదరదన్నారు. విద్యుత్ వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు ఏపీసీపీడీసీఎల్ డిపార్టుమెంట్ యాప్‌ని ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. సమావేశంలో డీఈ షియానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

- సినీ హీరో బూచేపల్లి కమలాకర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా..
- బూచేపల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 13న నిర్వహిస్తున్న ఉచిత మెగా కంటి వైద్యశిబిరాన్ని జయప్రదం చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి విజ్ఞప్తి చేశారు. వెంకాయమ్మ కుమారుడు, శివప్రసాదరెడ్డి సోదరుడు సినీ హీరో బూచేపల్లి కమలాకర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా పదేళ్లుగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. దానిలో భాగంగా ఈ నెల 13న ఉదయం 9 గంటల నుంచి చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. గుంటూరు జిల్లా పెదకాకానిలోని శంకర కంటి ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు శంకర కంటి ఆస్పత్రిలో ఉచితంగా చేసేందుకు బూచేపల్లి ఛారిటబుల్ ట్రస్ట్ పూర్తి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఆపరేషన్లకు ఎంపికైన వారిని శంకర కంటి ఆస్పత్రికి చెందిన బస్సుల ద్వారా చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపం వద్ద నుంచి తీసుకుపోయి ఆపరేషన్ అనంతరం తిరిగి చీమకుర్తికి చేరుస్తారన్నారు. వైద్యశిబిరంలో పాల్గొన్న వారికి, ఆపరేషన్ చేయించుకున్న వారికి ఉచితంగా మందులతో పాటు కళ్లజోళ్ళు, రాకపోకలు, భోజన సదుపాయం ఉచితంగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. చీమకుర్తి మండలంతో పాటు చుట్టు పక్కల మండలాలలోని గ్రామాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసే రోజు రోగులతో పాటు కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ అన్నదానం ఏర్పాటు చేసినట్లు వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి తెలిపారు. వైద్యశిబిరానికి హాజరయ్యే వారు ఆధార్‌కార్డుతో పాటు గతంలో ఆస్పత్రిలో చూపించుకున్న రిపోర్టులను కూడా తీసుకురావాలన్నారు. అనంతరం వైద్య శిబిరానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్ణిపాటి శేఖరరెడ్డి, రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ చల్లా అంకులు, మాజీ జెడ్పీటీసీ గోగినేని వెంకటేశ్వర్లు, కౌన్సిలర్‌లు సోమా శేషాద్రి, గోపురపు చంద్ర, కంజుల ప్రతాప్‌రెడ్డి, బీమన వెంకట్రావు, తప్పెట బాబూరావు, గంగిరెడ్డి సుందరరామిరెడ్డి, ఆముదాలపల్లి రామబ్రహ్మం, మేకల యల్లయ్య, బడే అయ్యపరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో భద్రతపై డీఆర్‌ఎం పరిశీలన


డీఆర్‌ఎంను సన్మానిస్తున్న దృశ్యం

మార్కాపురంరూరల్: స్థానిక రైల్వేస్టేషన్‌లో రైలు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై గుంటూరు డీఆర్‌ఎం రామకృష్ణ గురువారం అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గుంటూరు రైల్వే డీఆర్‌యూసీసీ సభ్యులు ఆర్‌కేజే నరసింహం, జిల్లా ప్రయాణికుల సంఘ అధ్యక్షుడు నరసింహాచార్యులు మాట్లాడుతూ అమృత భారత్ పథకం కింద రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ప్రయాణికుల కోసం గెస్టురూమ్స్, వెయిటింగ్ హాల్, కోచ్ ఇండికేషన్ బోర్డు, లిఫ్టు, 3వ ప్లాట్‌ఫారం ఏర్పాటు చేయాలని వినతిపత్రం ఇచ్చినట్లు ఆర్‌కేజే నరసింహం తెలిపారు. కాగా ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఎలూరి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో డీఆర్‌ఎంను కలిసి సన్మానించి వినతిపత్రం ఇచ్చారు. రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. రాత్రిళ్లు ఆటో డ్రైవర్లు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని, కొందరు ఆటో డ్రైవర్లు ప్రయాణికులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని డీఆర్‌ఎం దృష్టికి తీసుకునివచ్చారు. డీఆర్‌ఎం స్పందిస్తూ త్వరితగతిన సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు



కరపత్రాలు అందిస్తున్న ఏఓ శ్రీనివాసులు

మార్కాపురం టౌన్: మండలంలోని కొండేపల్లి రైతు సేవా కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్షా ఫలితాలు, ఎరువుల వినియోగంపై గురువారం రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శేషమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు ఎరువులు, పురుగుమందులు విచక్షణా రహితంగా వాడటం వల్ల నేల, గాలి, నీటి కాలుష్యంతో పాటు సాగు ఖర్చులు పెరిగి రైతుకు నికర ఆదాయం తగ్గిపోయింద న్నారు. ప్రస్తుత పరిస్థితులపై రైతులు అవగాహన కలిగి రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకం తగ్గించి సిఫార్సు మేరకే వాడాలన్నారు. సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, జీవ శిలీంద్రనాశినులు, వేప కషాయం, వేప నూనె లాంటి ప్రకృతి వనరులను వినియోగించడంతో పాటు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలన్నారు. భూసార పరీక్షా కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకురాలు ఎస్ సుచరిత మాట్లాడుతూ పొలాల్లో మట్టి నమూనాలు తీసి పరీక్షలకు పంపి తద్వారా లోపాలు సవరించుకోవాలన్నారు. సమస్యాత్మక భూముల యాజమాన్యం గురించి వివరించారు. ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలను వివరించారు. అనంతరం పాంప్లేట్‌లను రైతులకు అందించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారులు శైలజారాణి, హైమావతి, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం

- పూరిమెట్లలో నీటి కుంటలను పరిశీలించిన కేంద్ర బృంద సభ్యులు


నీటి కుంటలను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

ముండ్లమూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులు రైతులకు ఉపయోగ పడేలా ఉండాలని మినిస్ట్రీ ఆఫ్ స్టీల్ అండ్ సెంట్రల్ నోడల్ ఆఫీసర్, డైరెక్టర్ దేవిదత్త శాతపతి తెలిపారు. మండలంలోని పూరిమెట్లలో ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు నిర్మించుకుంటున్న నీటి కుంట పనులను గురువారం వారు పరిశీలించారు. ఈసందర్భంగా ఫారంపాండ్ల వద్ద మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ మనం చేసే పనులు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. ఒక రైతుకు లక్షా ఐదు వేలతో నీటి కుంట నిర్మాణానికి అవకాశం కల్పిస్తున్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు తమ పొలాల్లో కందకాలు తవ్వి గట్ల వెంబడి మొక్కలు నాటుకోవడం వల్ల తేమ సంరక్షణ ఎక్కువ కాలం ఉంటుందన్నారు. పండ్ల తోటల పెంపకానికి రైతులు ఆసక్తి చూపాలన్నారు. పంట చేతకందే వరకు పండ్ల మొక్కల పెంపకానికి రాయితీలు ఇస్తామని తెలిపారు. ప్రతి రైతు అవకాశం ఉన్నంత వరకు తమ పొలంలో నీటి కుంట ఏర్పాటు చేసుకోవడం ద్వారా నీటి ఎద్దడి నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. అనంతరం రైతుకు ఉపాధి హామీ పథకం పనులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జలశక్తి అభయాన్, భూగర్భజల శాస్త్రవేత్త సంతోష్‌గౌతమ్, జిల్లా నీటి యామాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.అర్జున్‌రావు, ఏపీడీ నిర్మల, ఎంఅండ్‌ఈ ఏపీఓ మధుసూదన్‌రావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ బి.జనార్దన్‌రావు, ఈఓఆర్డీ శ్రీదేవి, ఏపీఓ కె.నాగరాజు, ఈసీ శివరామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో మొక్కలు నాటాలి

ఒంగోలు: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి వాటిని సంరక్షించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి చేతులమీదుగా చేపట్టిన ఏక్‌పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో పాఠశాలల్లో విద్యార్థులచే పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. కార్యక్రమానికి సంబంధించి జియోటాగ్ ఫొటోలను వాట్సప్‌కు, వీడియోలను గూగుల్ డ్రైవ్‌లో అప్‌లోడ్ చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఈనెల 12న అమ్మ పేరుతో మొక్కల పెంపకం చేపట్టాలని, ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో పెద్ద ఎత్తున మొక్కల పెంపకం చేపట్టాలని ఆమె ఆదేశించారు.